

ఆకాశం వైపు రైతన్న చూపులు..


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్ Cell:9701249103



సంపుటి - 3 సంచిక -26 బుధవారం 24 జూన్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts


# మెట్రో విస్తరణపై ముందడుగు



**కేంద్ర మంత్రులు మనోహర్ ఖట్టర్,**

**అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డితో సీఎం రేవంత్ రెడ్డి చర్చలు సఫలం**

**ఫేజ్2 వాల్యుయేషన్.. ఫేజ్2 విస్తరణకు కన్సల్టెంట్‌గా ఎస్‌బీఐసీఏపీఎస్**

**కన్సల్టెంట్ రిపోర్ట్ ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ**

**సమన్వయ సభ్యులుగా కేంద్ర ప్రభుత్వ అధికారి, రాష్ట్ర ఎంఏయూడీ స్పెషల్ సెక్రెటరీ**



**న్యూఢిల్లీ జూన్ 23.(జర్నలిస్ట్ వార్త)**

హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణ అంశంలో కీలక ముందడుగు పడింది. హైదరాబాద్ మెట్రో ఫేజ్× స్వాధీనం, ఫేజ్2విస్తరణపై ఉన్న ఆటంకాలు తొలగనున్నాయి. కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డితో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిపిన రెండ్రోజుల చర్చలు ఫలప్రదమైనట్టు సీఎంఓ ఒక ప్రకటనలో పేర్కొంది. మంగళవారం నాడిక్కడ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. కృష్ణ మీనన్ మార్గ్ లోని ఖట్టర్ నివాసంలో జరిగిన ఈ భేటీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. దాదాపు అరగంట పాటు సాగిన ఈ సమావేశంలో హైదరాబాద్ మెట్రో ఫేజ్× వాల్యుయేషన్, ఫేజ్× స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ, ఇతర అంశాలపై కీలకంగా చర్చించారు. అలాగే మెట్రో ఫేజ్ 2 పై **మిగతా 2లో...**





# ఘనంగా పద్మ పురస్కారాల ప్రదానం

**పద్మభూషణ్ అందుకున్న నటుడు మమ్ముట్టి**

**పద్మశ్రీలు అందుకున్న మురళీమోహన్, రాజేంద్రప్రసాద్**

**కార్యక్రమంలో ప్రధాని మోడీ తదితరుల హాజరు**

**న్యూఢిల్లీ,జూన్ 23.(జర్నలిస్ట్ వార్త)**

రాష్ట్రపతి భవన్‌లో రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 65 మంది ప్రముఖులకు పద్మ అవార్డులు అందజేశారు. ఈ విడతలో మొత్తం 2 పద్మ విభూషణ్, 7 పద్మభూషణ్, 56 పద్మశ్రీ పురస్కారాలు ప్రదానం చేశారు. సినీ, సాహిత్య, వైద్య, క్రీడా తదితర రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులు**మిగతా 2లో...**



# పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంపు

**ఏపి కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం**

**80కి పైగా అంశాలకు గ్రీన్ సిగ్నల్**

**వివిధ ప్రాంతాల్లో పెట్టుబడులకు పెద్దపీట**

**పరిశ్రమలు, ఐటీ,పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లకు ప్రాధాన్యం**

**రూ.34వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35వేల ఉద్యోగాల కల్పన**

**ఉండవల్లిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన**

**జ్యుడిషియల్ అకాడమి నిర్మాణానికి రూ.139 కోట్ల వ్యయం**

**అమరావతి,జూన్ 23.(జర్నలిస్ట్ వార్త)**

ఏపీ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన భేటీలో 80కి పైగా అజెండా అంశాలకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వివిధ ప్రాంతాల్లో పెట్టుబడుల స్థాపనకు పెద్దపీట వేస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న దాదాపు రూ.34వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా **మిగతా 2లో...**



# కేంద్రమంత్రి రామ్మోహన్‌తో రాష్ట్ర మంత్రుల భేటీ

**గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై తుమ్మల విజ్ఞప్తి**




**న్యూఢిల్లీ,జూన్ 23.(జర్నలిస్ట్ వార్త)**

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున**మిగతా 2లో...**

# వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా

**ప్రభుత్వం జీవో విడుదల..**

**చేతల ప్రభుత్వం అన్న లోకేశ్**



2లో.

# ఆంధ్రా కేజీఎఫ్ ‘జొన్నగిరి’..

**నేడు ప్రారంభించనున్న చంద్రబాబు**

**-రూ.405 కోట్లతో జియో మైసూర్ సర్వీసెస్, డెక్కన్ గోల్డ్ మైన్స్ పెట్టుబడి.**

**-ఏడాదికి 400 కేజీలు, 900 కేజీలు, 2 టన్నులు-దశల వారీగా పెరగనున్న బంగారం వెలికితీత.**

**-ఉత్పత్తి అయిన బంగారం విలువలో రాష్ట్ర ఖజానాకు 4 శాతం రాయల్టీ.**

**-గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు.**

**-విస్తరణలో భాగంగా రెండో యూనిట్‌కూ శంకుస్థాపన.**



**అమరావతి/కర్నూలు , జూన్ 23.(జర్నలిస్ట్ వార్త)**

బంగారు నిక్షేపాల గని అంటే కర్నాటక రాష్ట్రంలోని కేజీఎఫ్ గుర్తొచ్చేది... కానీ ఇప్పుడు ఆ స్థానంలో జొన్నగిరి పేరు మారుమోగనుంది. కరవు కేకలు వినిపించిన ఒకప్పటి కర్నూలు జిల్లా ఇక బంగారం ఉత్పత్తికి ప్రధాన వేదిక కానుంది. దేశంలోనే ప్రైవేట్ రంగంలో అతిపెద్ద గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు కర్నూలు జిల్లా జొన్నగిరిలో ఏర్పాటైంది. జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్‌కు ప్రభుత్వం 1,500 ఎకరాల భూమిని కేటాయించింది. ప్రస్తుతం మొదటి దశలో 600 ఎకరాల్లో తవ్వకాలు జరగనున్నాయి. దీనికి తగినట్టుగా ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. రెండో దశలో మిగిలిన ప్రాంతంలోనూ ప్లాంట్ విస్తరించున్నారు. **మిగతా 2లో...**

# ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించాలి..

**తెలంగాణ రైతాంగ ప్రయోజనాల కోసం కేంద్రానికి వినతులు**

**కేంద్ర మంత్రులను కలిసిన తుమ్మల, ఉత్తమ్**



# మెట్రో ఆస్తులపై సీఎం కన్ను

**కాంగ్రెస్ అవినీతి పై పోరాటం చేస్తాం**

**హైదరాబాద్ మెట్రో ట్రైన్ పేరుతో రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి డ్రామాలు : కేటీఆర్**

**మియాపూర్ జూన్ 23.(జర్నలిస్ట్ వార్త)**

కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిపై పోరాటం చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి పార్టీ నియోజవకర్గ స్థాయి కార్యకర్తల సమావేశం **మిగతా 2లో...**



# గాదె సాయికృష్ణ కేసులో ... కృష్ణలంక సీఐ నాగరాజు అరెస్టు

**విజయవాడలో యువకుడు సాయికృష్ణ అదృశ్యంపై విచారణ**

**సీఐ అరెస్టును అడ్డుకునేందుకు మద్దతుదారుల ప్రయత్నం**

**అమరావతి,జూన్ 23.(జర్నలిస్ట్ వార్త)**

ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ (25) అదృశ్యం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు**మిగతా 2లో...**



# వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా

## ప్రభుత్వం జీవో విడుదల..ఁచేతల ప్రభుత్వం అన్న లోకేశ్

**అమరావతి,జూన్ 23.(జర్నలిస్ట్ వార్త)**

వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా ఇస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. తమది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. 'యువగళం పాదయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలు ప్రత్యక్షంగా చూశా. నాటి పాదయాత్ర సమయంలో తమ కులవృత్తిని కొనసాగించేందుకు క్వారీలు కేటాయించాలని వ్డడెర సోదరులు నన్ను కలిశారు. ఆనాడు నేను ఇచ్చిన హామీ మేరకు క్వారీల్లో 33 శాతం వాటాను వ్డడెరలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నం. 126 జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది' అని అన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంపైట్ల వ్డడెర సంఘాల నేతలు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# గాదె సాయికృష్ణ కేసులో ... కృష్ణలంక సీఐ నాగరాజు అరెస్టు

**మొదటిపేజీ తరువాయి**

బృందం (సిట్), సస్పెన్షన్‌కు గురైన కృష్ణలంక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎస్‌వీవీ నాగరాజును అదుపులోకి తీసుకుంది.గత మే 9న కృష్ణలంక పోలీసులు సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నారని, ఆ తర్వాత అతను కనిపించకుండా పోయాడని బాధితుడి తల్లి విజయలక్ష్మి ఆరోపించారు. పోలీసులు తన కుమారుడిని చిత్రహింసలకు గురిచేసి చంపేసి, మృతదేహాన్ని మాయం చేశారని ఆమె ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి, సీఐ నాగరాజును సస్పెండ్ చేయడంతో పాటు సమగ్ర విచారణ కోసం సిట్‌ను ఏర్పాటు చేసింది.ఈ క్రమంలో, సీఐ నాగరాజుపై హత్య, అక్రమ నిర్బంధం వంటి అభియోగాలతో భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మంగళవారం సిట్ అధికారులు విజయవాడ సింగ్ నగర్‌లోని నాగరాజు నివాసానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఆయన మద్దతుదారులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకోవడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది.

భారీగా మోహరించిన పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చి, నాగరాజును విచారణ నిమిత్తం సిట్ కార్యాలయానికి తరలించారు. అక్కడ సుమారు ఐదు గంటల పాటు సుదీర్ఘంగా విచారించిన అనంతరం ఆయనను అరెస్టు చేశారు. నాగరాజు అరెస్టుకు సంబంధించిన సమాచారాన్ని సిట్ అధికారులు ఆయన కుటుంబ సభ్యులకు అందించారు.

# కేంద్రమంత్రి రామ్మోహన్‌తో రాష్ట్ర మంత్రుల భేటీ

**మొదటిపేజీ తరువాయి**

విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసిన వెంటనే స్పందించి.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరఫున ఫీజిబులిటీ సర్వే చేసినందుకు రామ్మోహన్ నాయుడికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఫీజిబులిటీ సర్వేలో ప్రతిపాదిత స్థలం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతిపాదన చేసినట్లు చెప్పారు.అక్కడ త్వరగా ఫీజిబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రికి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# మెట్రో ఆస్తులపై సీఎం కన్ను

**మొదటిపేజీ తరువాయి**

మియాపూర్‌లోని నేరన్ గార్డెన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రో రైల్ పేరుతో రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.30 వేల కోట్ల మెట్రో రైల్ ఆస్తులపై రేవంత్ రెడ్డి కన్ను పడిందన్నారు. బీఆర్ఎస్ తరఫున కార్యకర్తల కష్టంతో గెలిచిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తన స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌లోకి మారారని ఆరోపించారు. ఆయననే గతంలో పదేండ్ల బీఆర్ఎస్ కాలంలో ఒక్క శేరిలింగంపల్లి నియోజకవర్గానికి రూ.9,500 కోట్లతో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులతో ఒక ప్రగతి నివేదికను విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు.మరి ఈ రెండేండ్లలో ఎన్ని డబ్బులు నియోజకవర్గానికి తెచ్చారో గాంధీ చెప్పాలని డిమాండ్ చేశారు. అబద్ధపు హామీలతో రేవంత్ రెడ్డి గద్దెనెక్కాడని ఆరోపించారు. తులం బంగారం, మహిళలకు రూ.2500 ఇవన్నీ ఎక్కడా అని ప్రశ్నించారు. కేసీఆర్ మళ్ళీ ఎప్పుడు అధికారంలోకి వస్తారా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో అరచకాలు సృష్టిస్తోందన్నారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ పైన కార్యకర్తలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, వివేక్, జగదీష్ రెడ్డి, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు, సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, శేరిలింగంపల్లి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెట్రో విస్తరణపై ముందడుగు

**మొదటిపేజీ తరువాయి**

చర్చలు జరిపారు. ఈ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలు, ఆలోచనలను సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రుల ముందుం చారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో కేంద్ర సహకారం అందించాలని కోరారు. ముఖ్యంగా ఫేజ్ 1 కు నిధుల సేకరణ, ఫేజ్ 2 విస్తరణ విషయంలో అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**సీఎం, కేంద్ర మంత్రుల మధ్య ఏకాభిప్రాయం**

వరుసగా జరిగిన ఈ సమావేశాల్లో సీఎం, కేంద్ర మంత్రుల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. ప్రధానంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్× వాల్యుయేషన్, ఫేజ్× స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ, రుణ సంస్థ ఎంపిక, మెట్రో ఫేజ్×× విస్తరణ, నిర్మాణ వ్యయం, అందుకు అవసరమైన రుణ సేకరణ అంశాలను అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ ను నియమించాలని నిర్ణయించారు. కన్సల్టెంట్‌గా ఎస్బీఐసీఏపీఎస్ ని ఎంపిక చేశారు. మెట్రో ఫేజ్× వాల్యుయేషన్ఁ ఫేజ్-×× విస్తరణ.. ఇతర అంశాలపై ఎస్బీఐసీఏపీఎస్ సమగ్రంగా అధ్యయనం చేయనుంది. ఈ కన్సల్టెంట్ సంస్థ ఇచ్చే రిపోర్ట్ ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ చేపట్టేందుకు అంగీకారం తెలిపారు. కన్సల్టెంట్ అధ్యయనం సమయంలో సమన్వయానికి ప్రతినిధు లుగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక అధికారి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి (ఎంఏ &యూడీ) శాఖ స్పెషల్ సెక్రెటరీ ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ అధికారులు ఇద్దరు సమన్వయం చేసు కుంటూ ఈ ప్రక్రియ వేగంగా సాగేందుకు కృషి చేస్తారని సీఎంఓ తెలిపింది.

కాగా హైదరాబాద్ డెవలప్‌మెంట్‌లో ప్రధాన భూమిక పోషించనున్న హైదరాబాద్ మెట్రో విస్తరణ లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో రెండ్రోజులు సమావేశమయ్యారు. తొలుత సోమవారం రాత్రి ఢిల్లీలోని రైల్వే భవన లో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు. దాదాపు రెండు గంటల పాటు సాగిన ఈ భేటీలో మెట్రో ఫేజ్ 1 కు ఇండియన్ రైల్వేఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్సీ) లోన్ పై చర్చించారు. అలాగే మెట్రో సెకండ్ ఫేజ్ అనుమ తుల వ్యవహారంలో అడ్డంకులపై చర్చిం చారు. అయితే ఈ భేటీలో మెట్రో విస్తరణ, నిధుల సమ కూర్పుపై సానుకూలత వచ్చినట్లు భేటీ అనంతరం సీఎం వెల్లడించారు. ఈ విషయంలో మరింత ముందుకు వెళ్లే అంశంపైఁ నోడల్ ఆఫీసర్‌గా ఉన్న కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రితో చర్చించాలని ఈ మీటింగ్ లో నిర్ణయించారు. ఈ మేరకు కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో కేంద్ర మంత్రులు ఫోన్ లో మాట్లాడారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ, అనుమతులు, నిధుల సేకరణ, ఇతర అంశాలపై చర్చించేందుకు కేంద్ర మంత్రి ఖట్టర్ తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

# పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంపు

**మొదటిపేజీ తరువాయి**

35వేల ఉద్యోగాల కల్పన సంబంధించిన నిర్ణయాలకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉండవల్లిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన, ఏపీ జ్యుడిషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.139 కోట్ల వ్యయంతో పనులు చేపట్టడం తదితర నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతిలో ఫైవ్‌స్టార్ హోటళు ,, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖ, తిరుపతి, కర్నూలు, అన్నవరం ప్రాంతాల్లోనూ పర్యాటక ప్రాజెక్టులకు క్యాబినెట్ అంగీకారం తెలిపింది. ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి మంత్రివర్గం అంగీకారం తెలిపింది. అనంతపురం, కడప జిల్లాల్లో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులకు భూముల కేటాయింపులు, బయోగ్యాస్ ఎ÷-లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతి ల్యాండ్ పూలింగ్ స్కీమ్ మొదటి, రెండో దశ కోసం సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లకు సంబంధించి 95 తాత్కాలిక పోస్టుల మంజూరుకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 30 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర కేబినెట్ శుభవార్త చెప్పింది. ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వరంగ సంస్థలు, గురుకుల విద్యాసంస్థలు, సొసైటీ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్ల పెంపునకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే, మెమో-57 ప్రకారం 2004 సంవత్సరానికి ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన సుమారు 11 వేల మంది ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ నుంచి పాత పెన్షన్ విధానం అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపడంతో ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# ఆంధ్రా కేజీఎఫ్ 'జొన్నగిరి'..

**మొదటిపేజీ తరువాయి**

ప్రస్తుతం ఏర్పాటైన ఈ ప్లాంట్ ద్వారా తొలి ఏడాదికి 400 కిలోల పసిడిని ఉత్పత్తి చేయనున్నారు. వచ్చే ఏడాది నుంచి 900 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తారు. ఈ రకంగా ఏ ఏడాదికి ఆ ఏడాది ఉత్పత్తి పెరుగుతూ... ఏడాదికి 2 టన్నుల వరకు బంగారం ఉత్పత్తి చేయనున్నారు. ఈ మేరకు ప్లాంట్ సామర్థ్యాన్ని ప్రాసెసింగ్ కెపాసిటీని విస్తరించనున్నారు. ఈ ప్లాంట్ ద్వారా 700 మందికి ఉపాధి లభిస్తుంది. ఇక ఉత్పత్తి చేసిన బంగారం ధరలో 4 శాతం రాష్ట్రానికి రాయల్టీగా వస్తుంది. మొదట తీసే 400 కేజీలకు రూ.57 కోట్లు, 900 కేజీలకు రూ.144 కోట్ల వరకూ రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం రానుంది.



**ప్రారంభోత్సవం. శంకుస్థాపన**

కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం, జొన్నగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. అనంతరం ప్లాంట్ విస్తరణలో భాగంగా రెండో యూనిట్‌కూ శంకుస్థాపన చేయనున్నారు. జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థలు రూ.405 కోట్ల పెట్టుబడితో బంగారు నిక్షేపాలు వెలికితీసే ఈ కర్మాగారాన్ని నెలకొల్పాయి. ఇందుకు అవసరమైన నీటి కోసం హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా 18 కి.మీ. పైపులైన్‌తో 0.021 టీఎంసీలను వినియోగించనున్నారు. ఈ మేరకు రేపు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా బంగారం ఉత్పత్తి పనులు ప్రారంభంకానున్నాయి. దీనికి సంబంధించి ఇప్పటికే గనిలో ట్రయల్ రన్స్ కూడా పూర్తయ్యాయి.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

కర్నూలు జిల్లాలో బుధవారం సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. జొన్నగిరిలో బంగారం శుద్ధి కర్మాగారం ప్రారంభోత్సవం సహా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి 11.30 గంటలకు జొన్నగిరికి చేరుకుంటారు. 11.45 గంటలకు ప్లాంట్ మొదటి యూనిట్ ను ప్రారంభించి... అనంతరం జీఈఓ మైసూర్ ప్లాంట్ రెండో యూనిట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12.20 గంటలకు జొన్నగిరిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. 3 గంటలకు పత్తికొండ నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అవుతారు.

# ఘనంగా పద్మ పురస్కారాల ప్రదానం

**మొదటిపేజీ తరువాయి**

ఈ గౌరవాలను అందుకున్నారు. మలయాళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ పురస్కారం లభించింది. అలాగే ప్రముఖ వైద్య నిపుణులు నోరి దత్తాత్రేయుడుకు కూడా పద్మభూషణ్ అవార్డు ప్రదానం చేశారు. తెలుగు సినీ రంగానికి చెందిన ప్రముఖ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌తో పాటు నటుడు ఆర్. మాధవన్‌కు పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. క్రికెటర్ రోహిత్ శర్మకు కూడా పద్మశ్రీ అవార్డును రాష్ట్రపతి అందజేశారు. ప్రఖ్యాత మలయాళ పాత్రికేయుడు పి.నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్ పద్మవిభూషణ్ అందుకోగా.. సినీ రంగ ప్రముఖులు మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తో పాటు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి నేడు పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నవారిలో సినీ నటులు మాగంటి మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్ ఉన్నారు. అలాగే, వీరితో పాటు సినీనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్ శర్మ, పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు. దేశంలోని పలు రంగాల్లో విశేష సేవలందించిన వారికి భారత గణతంత్ర దినోత్సవం వేళ కేంద్రం మొత్తం 131 మందికి పద్మ పురస్కారాలకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తొలి విడతలో 66 మందికి అందజేయగా.. మిగతా వారికి మంగళవారం ప్రదానం చేశారు. దేశ అభివృద్ధికి, తమ తమ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులను గౌరవించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పద్మ పురస్కారాలను ప్రదానం చేస్తోంది. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించాలి..

**దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలి**

**తెలంగాణకు తక్షణమే డీఏపీ, యూరియా సరఫరా చేయాలి**

**పప్పుధాన్యాలు, నూనెగింజల కొనుగోలుపై 25 శాతం పరిమితి ఎత్తివేయాలి**

**మొక్కజొన్న, జొన్నలను కేంద్రం ఎంఎస్‌పిపై కొనుగోలు చేయాలి**

**తెలంగాణ రైతాంగ ప్రయోజనాల కోసం కేంద్రానికి వినతులు**

**కేంద్ర మంత్రులను కలిసిన తుమ్మల, ఉత్తమ్**

**న్యూఢిల్లీజూన్ 23.(జర్నలిస్ట్ వార్త)**

: తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని బృందం మంగళవారం న్యూఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, రైతాంగ ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ, రైతుల ప్రయోజనాల పరిరక్షణ, దేశీయ వంటనూనెల ఉత్పత్తి పెంపుపై విస్తృతంగా చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్-ఆయిల్ పామ్ లక్ష్యాలను అత్యంత సమర్థవంతంగా అమలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి తుమ్మల వివరించారు. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరించగా, 70 వేల మందికిపైగా రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. రాబోయే మూడేళ్లలో ఈ విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. భారత్ ప్రస్తుతం వంటనూనెల అవసరాల్లో దాదాపు 60 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోందని, ఈ పరిస్థితిని మార్చేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ఔఇక్ష-క్షఖ కార్యక్రమం దేశ ఆర్థిక



వ్యవస్థకు, రైతాంగానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. అయితే ఇటీవల క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 44 శాతం నుంచి 16 శాతానికి తగ్గించడం వల్ల దేశీయ ఆయిల్ పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దిగుమతి సుంకం తగ్గింపుతో విదేశాల నుంచి చౌక ధరలకు పామాయిల్ దిగుమతులు పెరిగి దేశీయ మార్కెట్లో ధరలు పడిపోతున్నాయని, దీనివల్ల ఆయిల్ పామ్ రైతులు ఉత్పత్తి చేస్తున్న ఫ్రెష్ ఫ్రూట్ బంచ్‌లకు గిట్టుబాటు ధర లభించడం లేదని వివరించారు. దీర్ఘకాలిక పంట అయిన ఆయిల్ పామ్ సాగుకు రైతులు భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో ధరల అనిశ్చితి రైతుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. దిగుమతి సుంకాన్ని తిరిగి 44 శాతానికి పెంచడం ద్వారా దేశీయ ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఆత్మనిర్భర్ భారత్, ఎడిబుల్ ఆయిల్ స్వయం సమృద్ధి లక్ష్యాలు కూడా సాధ్యమవుతాయని మంత్రులు పేర్కొన్నారు. అలాగే ఆయిల్ పామ్ రైతులకు కనీస గ్యారంటీ ధర విధానాన్ని అమలు చేసే అంశాన్ని కూడా కేంద్రం పరిశీలించాలని కోరారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఆయిల్ పామ్ రైతుల భవిష్యత్తు దృష్ట్యా దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించి రైతులకు భరోసా కల్పించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని మంత్రులు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి

తెలంగాణ రైతాంగానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. రాష్ట్రంలో ఈ ఏడాది వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో డి.ఎ.పి, యూరియా ఎరువుల అవసరం గణనీయంగా పెరిగిందని, కేంద్రం కేటాయించిన కోటాకు మరియు వాస్తవ సరఫరాకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వెంటనే పూడ్చి, రాష్ట్రానికి పూర్తి స్థాయిలో ఎరువులు అందించాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఎరువుల సరఫరాను నిరంతరాయంగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పప్పుధాన్యాలు, నూనెగింజల కొనుగోళ్లపై ప్రస్తుతం అమలులో ఉన్న 25 శాతం పరిమితి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని పేర్కొన్నారు. రైతులు ఉత్పత్తి చేసిన మొత్తం పంటను కనీస మద్దతు ధర (ఓ÷ఞఖ) కింద కొనుగోలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుని ఆ పరిమితిని పూర్తిగా తొలగించాలని కోరారు. దీంతో పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుకు మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు దేశ ఆహార భద్రత, దిగుమతుల తగ్గింపుకు కూడా దోహదపడుతుందని వివరించారు. ఏడాది తెలంగాణలో రికార్డు స్థాయిలో సుమారు 15 లక్షల టన్నుల మొక్కజొన్న, 3 లక్షల టన్నుల జొన్నల ఉత్పత్తి నమోదైందని, మార్కెట్ ధరలు కనీస మద్దతు ధర కంటే దిగువకు పడిపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భారీ ఆర్థిక భారం భరించి మొక్కజొన్న, జొన్నలను కొనుగోలు చేసిందని, ఈ పంటలను కూడా కేంద్ర ప్రభుత్వ కొనుగోలు విధానంలో చేర్చి ఓ÷ఞఖపై సేకరించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రసాయనాలు-ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు తెలంగాణలో ఎరువుల సరఫరా, పోషకాధారిత ఎరువుల సబ్సిడీ విధానంలో మార్పులకు సంబంధించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల పలు లేఖలు రాయగా... ఈ వినతులపై స్పందించిన కేంద్ర మంత్రి తెలంగాణలో యూరియా, డి.ఎ.పి. తదితర ఎరువుల లభ్యత, సరఫరాపై కేంద్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని, రాష్ట్ర రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని శాఖ అధికారులను ఆదేశించినట్లు తన లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రస్తావించిన అంశాలపై కేంద్రం సానుకూలంగా స్పందించడం రైతాంగానికి ప్రయోజనకరంగా మారుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సమావేశాలలో మంత్రులు తుమ్మల, ఉత్తమ్ ల వెంట ఎంపిలు రఘువీర్ మరియు కొండ విశ్వేశ్వర్ రెడ్డి గారు పాల్గొన్నారు.

# డిజిటల్ లావాదేవీల్లో అప్రమత్తత అవసరం

## ధర్మసాగర్‌లో ఆర్థికసాంకేతిక అక్షరాస్యత సదస్సు



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, జూన్ 23 (జర్నలిస్ట్ వార్త):** గ్రామీణ ప్రజలు ఆధునిక బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకుంటూనే డిజిటల్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) ధర్మసాగర్ శాఖ మేనేజర్ ఆర్. వెంకటేష్ సూచించారు. డీసీసీబీ ధర్మసాగర్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రైతు వేదికలో నిర్వహించిన ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యత సదస్సులో ఆయన మాట్లాడారు. బ్యాంకు ప్రవేశపెట్టిన 'రాణి రుద్రమ్మ డిపాజిట్ స్కీమ్' కింద డిపాజిట్లపై గరిష్ఠంగా 8.10 శాతం వడ్డీ అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు, స్వయం ఉపాధి దారులు, చిన్న వ్యాపారులు బ్యాంకు రుణ సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. బర్రెలు, గొర్రెలు, ట్రాక్టర్లు, హార్వెస్టర్ల కొనుగోలు కోసం దీర్ఘకాలిక రుణాలతో పాటు గృహ, విద్యా రుణాలు కూడా అందుబాటులో ఉన్నాయని వివరించారు. యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు, లాకర్ సదుపాయాలపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి రాజేష్ మాట్లాడుతూ రైతులు బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవడం ద్వారా ఆర్థికంగా మరింత బలోపేతం కావచ్చన్నారు. డిజిటల్ లావాదేవీల సమయంలో ఓటీపీలు, వ్యక్తిగత వివరాలు ఇతరులకు వెల్లడించరాదని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ రెడ్డి, ఏఈఓ దివ్య, ధర్మసాగర్ పీఏసీఎస్ కార్యదర్శి పింగిలి రాజిరెడ్డి, బ్యాంకు సిబ్బంది ఆవుల కుమారస్వామి, బొడ్డు ప్రభుదేవ్, కలకోటి మురళీకృష్ణ, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# భక్త రామదాసు ప్రెస్ క్లబ్‌కు కొత్త కమిటీ

## మరోసారి అధ్యక్షుడిగా సైధులు -ఐక్యతతో ఏకగ్రీవ ఎన్నిక



**నేలకొండపల్లి, /జూన్ 23 (జర్నలిస్ట్ వార్త):** భక్త రామదాసు ప్రెస్ క్లబ్‌లో జర్నలిస్టుల ఐక్యత మరోసారి ప్రతిఫలించింది. రెండేళ్ల పదవీకాలం ముగియడంతో పాత కమిటీని రద్దు చేసి, మంగళవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ ఆవిర్భావం నుంచి సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎల్లుట్ల సైధులు (రాజముద్ర)ను మరోసారి అధ్యక్షుడిగా ఎన్నుకోవడం విశేషం.

జర్నలిస్టుల సమిష్టి నిర్ణయంతో దుడ్డెల సంజయ్ (ప్రజావాయిస్) కార్యదర్శిగా, పంభ సూర్యనారాయణ (సత్యవార్త) ఉపాధ్యక్షుడిగా, చిర్ర ముక్కంటి (బతుకమ్మ టీవీ) జాయింట్ సెక్రటరీగా, పంభ రవి (నమస్తే తెలంగాణ) కోశాధికారిగా, అవుట మధు (న్యూస్‌లైన్ తెలంగాణ) ప్రచార కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన సైధులు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి గౌరవ పరిరక్షణ, ప్రెస్ క్లబ్ అభివృద్ధే తన లక్ష్యమని తెలిపారు. సభ్యులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు మరింత బాధ్యతతో పనిచేస్తానన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, ప్రెస్ క్లబ్‌ను మరింత బలోపేతం చేయడానికి కార్యవర్గ సభ్యులతో కలిసి కృషి చేస్తానని చెప్పారు. ఎన్నికల అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను పలువురు జర్నలిస్టులు అభినందించారు. ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా కమిటీ ఎన్నిక కావడం జర్నలిస్టుల మధ్య ఉన్న స్నేహభావం, ఐక్యతకు నిదర్శనంగా నిలిచిందని సభ్యులు పేర్కొన్నారు.

# దాతల సహకారంతో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ




**కల్లూరు,/ జూన్ 23 (జర్నలిస్ట్ వార్త):** మున్సిపాలిటీ పరిధిలోని కప్పలబంధం రోడ్డులో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. దాతల సహకారంతో పాఠశాలలోని 84 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి ఐదు చొప్పున మొత్తం 420 నోట్‌బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) నివేదిత విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. విద్యాభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందిస్తాయని ఆమె పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వర్క రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉబ్బన బాబూరావు, జల్లి రామకృష్ణ, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, ఉబ్బన వేణుబాబు, దామాల దయాకర్‌రావు, మలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏడవ షరగత్ సందర్భంగా పీర్ల చావిడిలో భక్తుల రద్దీ



**తల్లాడ,/ జూన్ 23 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ పట్టణంలోని పీర్ల చావిడి ప్రాంగణం సోమవారం ఏడవ షరగత్ సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ముజావర్ షేక్ ఈసుబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పీర్ల ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థిస్తూ చాదర్ సమర్పణ కార్యక్రమాలు చేపట్టారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ వేడుకలో మత సామరస్య సందేశం ప్రతిధ్వనించింది. పీర్ల పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తూ సోదరభావాన్ని పెంపొందిస్తోందని నిర్వాహకులు తెలిపారు. పీర్ల దీవెనలతో ప్రజల జీవితాల్లో ఆనందాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ ఏడవ షరగత్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆకాశం వైపు రైతన్న చూపులు..

## కరుణించని వరుణుడు.. వెయ్యి కళ్లతో వాన కోసం ఎదురుచూపులు



వానాకాలం వచ్చిందంటే రైతు ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. తొలి వర్షాలు కురవగానే పొలాల్లో దుక్కులు, విత్తనాల చల్లడం, సాగు పనులతో గ్రామాలు సందడిగా మారిపోతాయి. వ్యవసాయ దుకాణాలు రైతులతో కిటకిటలాడుతాయి. ట్రాక్టర్ల శబ్దాలతో గ్రామీణ ప్రాంతాలు మారుమోగిపోతాయి. కానీ ఈ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. జూన్ నెల చివరి వారానికి చేరుకున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులంతా ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. మేఘాలు కనిపిస్తున్నా వాన జాడ లేకపోవడంతో అన్నదాత గుండెల్లో ఆందోళన పెరుగుతోంది. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం రైతుల మధ్య ఒకటే చర్చ సాగుతోంది. "ఈరోజైనా వర్షం పడుతుందా?", "ఇంకెన్ని రోజులు వేచి చూడాలి?", "పంటలు ఎప్పుడు వేయాలి?" అనే ప్రశ్నలే వినిపిస్తున్నాయి. ఉదయం నిద్రలేచిన రైతు నుంచి రాత్రి నిద్రపోయే వరకు ఆకాశాన్ని గమనిస్తూనే ఉన్నాడు. మేఘాలు కమ్ముకుంటే ఆశపడుతున్నాడు. గాలి బలంగా వీచినా, ఉరుములు వినిపించినా వర్షం కురవకపోతే నిరాశ చెందుతున్నాడు. ఇప్పటికే రైతులు అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేశారు. ట్రాక్టర్లతో పొలాలు దున్నించి సాగుకు సిద్ధం చేశారు. కొందరు కౌలు రైతులు భూములు తీసుకుని పెట్టుబడులు పెట్టారు. అయితే సరిపడా వర్షాలు లేకపోవడంతో విత్తనాలు వేయడానికి వెనుకాడుతున్నారు. తొందరపడి విత్తనాలు వేస్తే మొలకలు దెబ్బతింటాయనే భయం వెంటాడుతోంది. మరోవైపు అప్పులు చేసిన రైతులు వడ్డీల భారం పెరుగుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు.

గత కొద్ది రోజులుగా పలుచోట్ల మేఘావృత వాతావరణం కనిపిస్తున్నా రైతులు ఆశించే స్థాయిలో వర్షాలు కురవడం లేదు. కొన్ని ప్రాంతాల్లో కేవలం చినుకులు మాత్రమే పడుతున్నాయి. సాగుకు అవసరమైన తేమ భూమిలో లేకపోవడంతో రైతులు మరికొంతకాలం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాతావరణ శాఖ వర్షాలు పడతాయని చెబుతున్నా, కళ్లముందు పొలాలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఒకప్పుడు తొలి వర్షాలకే కళకళలాడే చెరువులు, కుంటలు ఈసారి పూర్తిస్థాయిలో నీటిని సంతరించుకోలేదు. వాగులు, వంకలు వెలవెలబోతున్నాయి. భూగర్భ జలాలు తగ్గిపోవడంతో బోర్లపై ఆధారపడే రైతులు అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోంది. విద్యుత్ సమస్యలు, పెరుగుతున్న సాగు వ్యయం రైతు నెత్తిన మరింత భారాన్ని మోపుతున్నాయి. పశువులకు తాగునీరు, మేత అందించే పరిస్థితి కూడా క్రమంగా కష్టంగా మారుతోంది. వర్షాలు ఆలస్యమైతే వరి, పత్తి, మొక్కజొన్న, కంది, పెసర, సోయాబీన్ వంటి ప్రధాన పంటల సాగు కాలం దెబ్బతినే ప్రమాదం ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పంటల విత్తనాలు ఆలస్యంగా వేయాల్సి వస్తే దిగుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇప్పటికే పెట్టుబడుల భారంతో సతమతమవుతున్న రైతులకు ఇది మరో ఎదురుదెబ్బగా మారనుంది. పంట దిగుబడి తగ్గితే రైతు ఆదాయం తగ్గిపోవడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది.

అయితే రైతన్న ఆశ మాత్రం ఎప్పటికీ చావదు. ఎండలు, వరదలు, నష్టాలు, అప్పులు ఎన్నో చూసినా ప్రకృతిపైనే నమ్మకం ఉంచి ముందుకు సాగుతుంటాడు. ఆకాశంలో నల్లని మేఘాలు కనిపిస్తే చాలు మళ్లీ కొత్త ఆశలు చిగురిస్తాయి. తొలి వాన చినుకు నేలను తాకిన క్షణం రైతు ముఖంలో కనిపించే ఆనందం వర్ణనాతీతం. ఎందుకంటే ఆ చినుకులోనే అతని ఏడాది కష్టం, కుటుంబ భవిష్యత్తు, ఆశలు, కలలు దాగి ఉంటాయి.

ప్రస్తుతం ప్రతి రైతు హృదయం ఒకటే కోరుకుంటోంది. "వరుణదేవా.. ఇంక ఆలస్యం చేయకు. మా పొలాలను తడుపు. మా ఆశలను నిలబెట్టు." అని ప్రార్థిస్తోంది. సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు నిండాలని, పచ్చని పంటలతో పొలాలు కళకళలాడాలని, రైతన్న ముఖంలో మళ్లీ చిరునవ్వు విరబూయాలని గ్రామీణ సమాజం ఎదురుచూస్తోంది. రైతు పొలంలో పచ్చదనం కనిపిస్తేనే గ్రామం సంతోషంగా ఉంటుంది. గ్రామం సుభిక్షంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. అందుకే ప్రస్తుతం ఆకాశం వైపు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్న రైతన్న ఆశలు ఫలించాలని, వరుణుడు కరుణించాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు.



సీనియర్ జర్నలిస్టు
కొట్టే సుధాకర్ (లెనిన్)
టి యు డబ్ల్యు జే (ఐ.జె.యు) జిల్లా
కార్యవర్గ సభ్యులు 9908401581

# ముఖర్జీ ఆశయాల సాకారమే ఆర్టికల్-370 రద్దు

## బలిదాన్ దివస్ సందర్భంగా బీజేపీ నేతల నివాళి



**నర్సంపేట, జూన్ 23:**

భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు, గొప్ప దేశభక్తుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా సోమవారం బీజేపీ నర్సంపేట నియోజకవర్గ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ దేశ సమగ్రత కోసం డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. "ఒకే దేశంలో రెండు చట్టాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు చెల్లవు" అనే నినాదంతో ఆయన సాగించిన ఉద్యమం దేశ ఐక్యతకు బాటలు వేసిందన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్-370 రద్దుతో ముఖర్జీ ఆశయాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం సాకారం చేసిందని పేర్కొన్నారు. కాశ్మీర్ నేడు దేశ అభివృద్ధి ప్రవాహంలో భాగస్వామిగా మారడం ముఖర్జీకి అర్పించే గొప్ప నివాళి అని అన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వద్దేపల్లి నరసింహారాములు, జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్, పార్లమెంట్ కో-కన్వీనర్ కట్ల రామచంద్రరెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు కిరణ్, నర్సంపేట నియోజకవర్గ సీనియర్ నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రక్షాళనకు రంగం సిద్ధం

## ధర్మసాగర్‌లో బీఎల్‌వోలు, బీఎల్ఏలకు ప్రత్యేక శిక్షణ

### 25 నుంచి ఇంటింటి సర్వే.. అర్హులైన ఓటర్ల నమోదు, అనర్హుల తొలగింపుపై దృష్టి

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, జూన్ 23 (జర్నలిస్ట్ వార్త):** ఓటరు జాబితాలను తప్పుల్లేకుండా, పారదర్శకంగా రూపొందించేందుకు ఎన్నికల యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా మండలంలోని బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కోసం మంగళవారం ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. తహసీల్దార్ భావ్‌సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గిర్దావర్ అశోక్‌రెడ్డి, జీపీవోలు, మండలంలోని 45 పోలింగ్ కేంద్రాలకు చెందిన బీఎల్‌వోలు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల బీఎల్ఏలు పాల్గొన్నారు. ఎన్నికల శిక్షకుడు రాజేందర్ ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించడం, కొత్తగా అర్హత పొందిన వారి పేర్లను నమోదు చేయడం, మరణించినవారు లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లను గుర్తించి జాబితా నుంచి తొలగించే విధానాలను వివరించారు. అలాగే ఎన్నికల సంఘం నిర్దేశించిన ఫారాల వినియోగం, సర్వే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. శిక్షణ సందర్భంగా బీఎల్‌వోలు, బీఎల్ఏలు వ్యక్తం చేసిన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ఎన్నికల ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందుతుందని పేర్కొన్నారు. ఈ నెల 25 నుంచి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 0ప్రారంభమవుతుందని, అనంతరం బీఎల్‌వోలు ఇంటింటి సర్వే చేపట్టి అర్హులైన ఓటర్ల వివరాలను సేకరించనున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ప్రక్రియను పూర్తి చేసి, తప్పుల్లేని ఓటరు జాబితా తయారుకు సహకరించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.





# రైతులకు చేరువగా నాణ్యమైన విత్తనాలు





## ధర్మసాగర్ రైతు వేదికలో విత్తన మేళా ప్రారంభం




**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, జూన్ 23 (జర్నలిస్ట్ వార్త):** ఖరీఫ్ సీజన్‌కు రైతులు నాణ్యమైన సన్నరకం వరి విత్తనాలు సులభంగా పొందేలా ప్రభుత్వం చేపట్టిన విత్తన మేళా కార్యక్రమం సోమవారం ధర్మసాగర్ రైతు వేదికలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ధర్మసాగర్ గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా ముఖ్య అతిథిగా హాజరై మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతు వేదికల ద్వారా నేరుగా నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారి రాజేష్ మాట్లాడుతూ మండలంలోని ధర్మసాగర్, ఎల్కుర్తి, నారాయణగిరి, పెద్దపెండ్యాల, తాటికాయల రైతు వేదికల్లో ఈ నెల 23 నుంచి 30 వరకు విత్తన మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విత్తన డీలర్లు రైతు వేదికలను విక్రయ కేంద్రాలుగా ఉపయోగించుకుని నాణ్యమైన సన్నరకం వరి విత్తనాలను రైతులకు అందించాలని కోరారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ధృవీకరించిన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు.

కార్యక్రమంలో సంబంధిత క్లస్టర్ ఏఈఓలు, పీఏసీఎస్ సీఈఓ రాజిరెడ్డి, గ్రామ ప్రజాప్రతినిధులు, విత్తన డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రవేశాల కోసం అధ్యాపకుల విస్తృత ప్రచారం.

### -కాలేజీలో చేరిన విద్యార్థినిలకు ఉచిత హాస్టల్ సౌకర్యం.





**బయ్యారం/,జూన్ 23.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు,విద్యా సంవత్సరంలో ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని,వారి ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. కాలేజీలో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థినిలకు ఉచిత హాస్టల్,భోజన,వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వారు తెలిపారు.

కళాశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సదుపాయాలు,పాఠ్యపుస్తకాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, ఇతర సౌకర్యాల గురించి వివరించారు. ఈ ప్రచారం ద్వారా ఇప్పటివరకు సుమారు 35 మంది విద్యార్థులు కళాశాలలో ప్రవేశాలు పొందినట్లు ప్రిన్సిపాల్ రాజమణి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరిన బాలికలకు పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహంలో ఉచిత హాస్టల్ సదుపాయాన్ని వినియోగించుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని ప్రిన్సిపాల్ విద్యార్థినిలను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో అధ్యాపకులు సంతోష్, భాస్కర్,బాబులాల్,రాజు, అడ్మిషన్ స్పెషల్ డ్రైవ్ లో పాల్గొన్నారు.

# బయ్యారం మండలంలో రైతు వేదికల్లో ప్రారంభమైన విత్తన మేళా.





**బయ్యారం/,జూన్ 23.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలంలోని రైతువేదికలలో వానాకాలం సాగుకు అవసరమైన విత్తనాల విక్రయాల కోసం మండల వ్యవసాయ అధికారి కే. రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విత్తన మేళా కార్యక్రమాన్ని ఆయా గ్రామాల సర్పంచులు ఘనంగా ప్రారంభించారు. బయ్యారం రైతువేదికలో నిర్వహించిన విత్తన మేళాను బయ్యారం సర్పంచ్ శాంతి కిషన్ నాయక్,జగ్గుతండా సర్పంచ్ బొల్లి జయంతి ప్రారంభించి రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. రామచంద్రాపురం రైతువేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను రామచంద్రాపురం సర్పంచ్ గుగులోత్ వనిత మంగీలాల్,కొత్తపేట రైతువేదికలో నిర్వహించిన విత్తన మేళాను సింగారం సర్పంచ్ సపావత్ సరస్వతి రాందాస్ ప్రారంభించి రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు.రైతువేదికలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా విత్తన విక్రయదారులు రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయిస్తున్నారు. పలువురు రైతులు విత్తనాలను కొనుగోలు చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విత్తన మేళా ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని ఏఓ రాజు రైతులను కోరారు. మండలంలోని అన్ని రైతువేదికలలో నిర్వహించిన విత్తన మేళాలకు పెద్ద సంఖ్యలో రైతులు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో మండల వ్యవసాయ అధికారి,వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు. రైతులకు అవసరమైన సూచనలు,సలహాలు అందిస్తూ విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించారు.

# ముల్కనూరులో ప్రారంభమైన విత్తన మేళా





**భీమదేవరపల్లి/జూన్23 (జర్నలిస్ట్ వార్త):** రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచి వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జూన్ 23 నుంచి 29 వరకు నిర్వహిస్తున్న ఏడు రోజుల విత్తన మేళా కార్యక్రమం మంగళవారం భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరు రైతు వేదికలో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ముల్కనూరు గ్రామ సర్పంచ్ ప్రమోద్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి పద్మ, రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) సంయుక్తంగా ప్రారంభించారు. విత్తన మేళా సందర్భంగా ముల్కనూరు సహకార సంఘం, టీజీ సీడ్స్, ప్రైవేట్ విత్తన డీలర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ఏడు వరి సన్న రకాలతో పాటు పప్పు దినుసులు, కూరగాయల విత్తనాలు, నూనె గింజలు, నానో యూరియా, నానో డీఏపీ తదితర వ్యవసాయ ఉత్పత్తులు రైతు వేదికలో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పద్మ తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విత్తనాలను సేకరించుకోవాలని ఆమె సూచించారు. విత్తన మేళా ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన కల్పించడంతో పాటు అధిక దిగుబడులు సాధించేందుకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, ఏఈఓలు, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

## భీమదేవరపల్లిలో రూ.20 లక్షల సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**భీమదేవరపల్లి/జూన్ 23 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండల కేంద్రంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో మంజూరైన రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాచర్ల కుమారస్వామి మాట్లాడుతూ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో గ్రామానికి రూ.20 లక్షల నిధులు మంజూరై సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శనిగరం అయిలయ్య, వార్డు సభ్యులు ప్రేమలత, సదానందం, శ్రీనివాస్ రెడ్డి, లలిత, అశోక్, వెంకటేశ్వర్లు, శ్యామ్, విజయ, సంధ్య, గ్రామ కార్యదర్శి మోహన్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్వేత, గ్రామస్తులు తిరుపతి, మనోహర్, జేమ్స్, సతీష్, అజయ్, ఇటిక్యాల సదయ్య, టప్పకాన సదయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



**ఖమ్మం,/ జూన్ 23 (జర్నలిస్ట్ వార్త):** ౦
ఈ నెల 28న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం పోస్టర్‌ను సోమవారం తెలంగాణ ఉద్యమ నాయకులు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమ్మేళనానికి సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ ఉద్యమకారులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిడమర్తి రవి, డాక్టర్ కె.వి. కృష్ణారావు, నందిగామ రాజ్‌కుమార్ జానీ, బొబ్బిలి భరత్ చంద్ర, వేల్పుల మురళీ, విజయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేలాది మంది ఉద్యమకారులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని, అయితే రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన అనేక మంది ఉద్యమకారులు నేటికీ పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల గౌరవ పెన్షన్, ప్రత్యేక ఆరోగ్య బీమా సౌకర్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ప్రత్యేక కోటా, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన, ఉద్యమకారుల గౌరవ పరిరక్షణ, వారి హక్కుల సాధనే సమ్మేళనం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు, విద్యార్థి నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఒక్క గిర్దావరితో తల్లాడకు సరిపోతుందా?

### నూతనంగా బాధ్యతలు చేపట్టిన వసీమ్ అహ్మద్

### మరో ఆర్ఐ నియామకానికి ప్రజల డిమాండ్



**తల్లాడ,/ జూన్ 23 (జర్నలిస్ట్ వార్త):**
తల్లాడ వంటి విస్తారమైన మండలానికి ఒక్క గిర్దావరిని మాత్రమే నియమించడం సరిపోతుందా అనే ప్రశ్న స్థానిక ప్రజల నుంచి వినిపిస్తోంది. రెవెన్యూ శాఖలో సిబ్బంది కొరత కారణంగా ఇప్పటికే కుల, ఆదాయ, నివాస, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ, వారసత్వ ధ్రువీకరణ పత్రాల జారీ ఆలస్యమవుతుండగా, తాజాగా సయ్యద్ వసీమ్ అహ్మద్ గిర్దావరిగా బాధ్యతలు స్వీకరించారు. మండలంలో రెవెన్యూ తనిఖీ అధికారులు లేకపోవడంతో ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగార్థులు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గిర్దావరిని నియమించినా, భారీ పరిధి కలిగిన మండలానికి ఒక్కరే ఉండటం వల్ల సమస్యలు పూర్తిగా తీరే అవకాశం కనిపించడం లేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న దరఖాస్తులు, భూ సమస్యలు, ధ్రువీకరణ పత్రాల పరిశీలన వంటి పనులన్నింటినీ ఒకే అధికారి నిర్వహించడం వల్ల మరింత జాప్యం జరిగే అవకాశాలు ఉన్నాయని దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు సత్వర సేవలు అందాలంటే మరో ఆర్ఐ లేదా అదనపు గిర్దావరిని వెంటనే నియమించాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.
కొత్తగా బాధ్యతలు చేపట్టిన వసీమ్ అహ్మద్‌పై ప్రజలు ఆశలు పెట్టుకున్నప్పటికీ, సిబ్బంది కొరత సమస్యను ప్రభుత్వం శాశ్వతంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. "తల్లాడకు ఒక్క గిర్దావరి కాదు.. కనీసం ఇద్దరు అధికారులు అవసరం" అనే అభిప్రాయం మండలవ్యాప్తంగా వ్యక్తమవుతోంది.

## ఎస్సై ప్రశాంత్ బాబును సన్మానించిన లంబాడి జేఏసీ నాయకులు.



**బయ్యారం/,జూన్ 23.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం పోలిస్టేషన్ లో ఎస్సైగా ప్రశాంత్ బాబు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మంగళవారం వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ లంబాడి జేఏసీ నాయకులు మర్యాద పూర్వకంగా ఎస్సై కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి భూక్య రవి నాయక్,జరుపుల శ్రీను నాయక్,సర్పంచ్ అజ్మీరా దేవోజీ నాయక్,జాటోత్ రవి,అజ్మీరా శ్రీకాంత్,గుగులోత్ నరేష్, భూక్యా చిరంజీవి,భూక్యా లక్ష్మాన్,భూక్యా నాగ,అజ్మీరా అరుణ్ తదితరులు కలిశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ మండలంలో గిరిజనులు,గిరిజనేతరులు కలిసిమెలిసి ఉండాలని,శాంతిభద్రతలకు అందరు సహకరించాలని,మద్యం సేవించి వాహనాలు నడపకూడదని,సైబర్ మోసగాళ్ల వలలో పడకూడదని,ఎవరైనా అనుమానస్పదంగా ఊర్లలోకి వస్తే మాకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

# మహిళల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి



**పర్వతగిరి/జూన్ 23(జర్నలిస్ట్ వార్త):** మహిళల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని అనంతారం సర్పంచ్ తౌటి శ్రీలత, సెర్ప్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ గోలి కొమురయ్య అన్నారు. మండలంలోని అనంతారం గ్రామంలో మంగళవారం సరస్వతీ గ్రామైక్య సంఘం నెలసరి సమావేశం గొర్రె సుకన్య అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి గ్రామాలను హరిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. మహిళలు, బాలల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను తెచ్చిందని, అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నెంబర్లను ఉపయోగించుకోవాలని సూచించారు. వేధింపులు, సమస్యల నివారణకు 100, 1098, 181 నెంబర్ల పట్ల మహిళలు అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించి, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా గ్రామీణులు చొరవ చూపాలని కోరారు. మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా శక్తి పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మొదటిసారి సమావేశానికి వచ్చిన సర్పంచ్ శ్రీలతను, కొత్తగా బాధ్యతలు చేపట్టిన కార్యదర్శి అనిత, ఎంపీవో శేషాంజనేయులును సంఘ ప్రతినిధులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ నాగమణి, ఏఎన్ఎం రజిత, వివో ప్రతినిధులు సరోజన, పద్మ, శిరీష, రేణుక, ఆశ వర్కర్లు, మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

# మా ఇంటి బంగారాన్ని అభినందించిన మెగాస్టార్

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం విడుదలైన తర్వాత మంచి స్పందనను అందుకుంటోంది. దర్శకుడు రాజ్ నిడిమోరుతో వివాహం అనంతరం సమంత నటించిన తొలి సినిమా కావడంతో ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. జూన్ 19న థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం పాజిటివ్ టాక్‌తో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా మంచి వసూళ్లను నమోదు చేస్తోంది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. సమంత, రాజ్ నిడిమోరు దంపతులతో పాటు దర్శకురాలు నందిని రెడ్డి, చిత్ర యూనిట్ సభ్యులను తన నివాసానికి ఆహ్వానించిన ఆయన, సినిమా విజయంపై శుభాకాంక్షలు తెలిపారు. సినిమా చూసిన అనంతరం చిరంజీవి తన అభిప్రాయాన్ని పంచుకుంటూ, మా ఇంటి బంగారం చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఉమ్మడి కుటుంబం నేపథ్యంలో యాక్షన్, భావోద్వేగాలను అందంగా మేళవిస్తూ దర్శకురాలు నందిని రెడ్డి తనదైన శైలిలో వినోదాత్మకంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు అని పేర్కొన్నారు. అలాగే సమంత నటనను ప్రత్యేకంగా ప్రశంసించిన ఆయన, సమంత నటన అద్భుతంగా ఉంది. ముఖ్యంగా చీరకట్టులో ఆమె చేసిన యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇటువంటి మహిళా ప్రాధాన్య చిత్రాలు తెలుగు సినీ పరిశ్రమకు అవసరం. ఈ విజయానికి సమంత, నందిని రెడ్డి, రాజ్ మరియు మొత్తం చిత్ర బృందానికి హృదయపూర్వక అభినందనలు అని తెలిపారు. మరోవైపు జీవితంలో కొత్త అధ్యాయాన్ని ఆహ్వానిస్తున్న సమంత, రాజ్ దంపతులకు ప్రత్యేక అభినందనలు అని ఆయన పేర్కొన్నారు. చిరంజీవి సతీమణి సురేఖ సమంత దంపతులకు కొత్త బట్టలు పెట్టి ఆశీర్వదించారు. ఈ కామెంట్



ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీసింది. ముఖ్యంగా 'కొత్త అధ్యాయం' అనే పదం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. దీనిపై సోషల్ మీడియాలో పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. సమంత ప్రగ్నెన్సీ విషయంలో చిరు ఈ కామెంట్ చేశారా అని పలువురు ముచ్చటించుకుంటున్నారు. ఇక జూన్ 19న విడుదలైన 'మా ఇంటి బంగారం' మొదటి రోజునుంచే ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంది. ముఖ్యంగా సమంత నటన, భావోద్వేగ సన్నివేశాలు, కుటుంబ నేపథ్యం, యాక్షన్ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

# పెద్ది తరవాత బుచ్చిబాబులో మార్పు

## కొత్త సినిమా కోసం వేగం పెంచాలని నిర్ణయం





టాలీవుడ్‌లో దర్శకుడు బుచ్చిబాబు సాన గురించి మాట్లాడినప్పుడు ముందుగా గుర్తుకొచ్చేది ఆయన కథలపై చూపించే నిబద్ధత. ఒక సినిమా పూర్తయిన వెంటనే మరో ప్రాజెక్ట్‌ను ప్రారంభించే దర్శకుల కంటే, కథను పూర్తిగా సిద్ధం చేసి, ప్రతి అంశాన్ని పక్కాగా మలిచిన తర్వాతే సెట్స్‌పైకి తీసుకెళ్లే దర్శకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అయితే ఇప్పుడు బుచ్చిబాబు తన పని విధానంలో కీలకమైన మార్పుకు సిద్ధమవుతున్నారనే చర్చ ఇండస్ట్రీలో జోరుగా సాగుతోంది. 'ఉప్పెన' సినిమాతో దర్శకుడిగా అద్భుతమైన అరంగేట్రం చేసిన బుచ్చిబాబు తొలి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకున్నారు. అయితే ఆ సినిమా తర్వాత వెంటనే కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించకుండా, తన రెండో చిత్రానికి అవసరమైన కథ, పాత్రలు, ప్రీ-ప్రొడక్షన్ పనులపై చాలా సమయం కేటాయించారు. దీంతో 'ఉప్పెన' తర్వాత ఆయన తదుపరి చిత్రం కోసం అభిమానులు, సినీ పరిశ్రమ దాదాపు కొన్ని సంవత్సరాలు ఎదురుచూడాల్సి వచ్చింది. చివరకు రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని అందుకుంది. 'పెద్ది' విజయం బుచ్చిబాబు కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా నిలిచింది. గ్రామీణ నేపథ్యం, భావోద్వేగాలతో కూడిన కథనం, పాత్రల రూపకల్పన, విజువల్ ట్రీట్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఆయన కథ చెప్పే తీరు, భావోద్వేగాలను తెరపై ఆవిష్కరించే విధానానికి విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభించాయి. గతంతో పోలిస్తే చాలా తక్కువ సమయంలోనే తన తదుపరి సినిమాను ప్రకటించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం టాలీవుడ్‌లో పోటీ తీవ్రంగా పెరిగింది. ఒక దర్శకుడు వరుస విజయాలను కొనసాగించాలంటే తక్కువ వ్యవధిలోనే కొత్త ప్రాజెక్ట్‌లను ప్రకటించడం కూడా కీలకంగా మారింది. ఈ విషయాన్ని బుచ్చిబాబు కూడా గుర్తించినట్లు కనిపిస్తోంది. అందుకే ఈసారి కథా రచన, ప్రీ-ప్రొడక్షన్ పక్రియలను వేగంగా పూర్తి చేసి తదుపరి సినిమాను త్వరగా పట్టాలెక్కించాలని ఆయన భావిస్తున్నారని సమాచారం.

# వరుస సినిమాలతో ప్రభాస్ బిజీ



ఇండియన్ సినిమా బిగ్గెస్ట్ సూపర్ స్టార్‌గా గుర్తింపు పొందిన ప్రభాస్ ప్రస్తుతం వరుస పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాడు. 'బాహుబలి' తర్వాత ఆయన క్రేజ్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించగా, ప్రతి సినిమా మీద అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. అయితే ఈ ఏడాది విడుదలైన 'రాజా సాబ్' సినిమా మాత్రం అభిమానులు ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. ఇదిలా ఉంటే, దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. మొదట ఈ చిత్రాన్ని 2026 చివర్లో విడుదల చేయాలని భావించినప్పటికీ, ప్రస్తుతం ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం 'ఫౌజీ' 2027లో విడుదలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. అయితే ఇదే ఇప్పుడు ప్రభాస్ అభిమానులకు మరింత ఆనందాన్ని కలిగిస్తోంది. ఎందుకంటే 2027లో ప్రభాస్ నుంచి ఏకంగా మూడు భారీ ప్రాజెక్టులు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందులో మొదటిగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న 'స్పిరిట్' ఉంది. ఈ చిత్రంలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడనే ప్రచారం ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. మరోవైపు 'బాహుబలి' ప్రపంచాన్ని మరోసారి తెరపైకి తీసుకొచ్చే యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' కూడా 2027లో విడుదల కానున్నట్లు తెలుస్తోంది. 'బాహుబలి' ఫ్రాంచైజీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ ప్రాజెక్ట్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. అదే సమయంలో 'ఫౌజీ' కూడా అదే ఏడాదిలో విడుదలైతే, ప్రభాస్ అభిమానులకు ఒకే ఏడాదిలో మూడు భారీ ట్రీట్స్ ,ంచినట్లవుతుంది. దీంతో 2027ను ఇప్పటికే అభిమానులు 'ప్రభాస్ నామ సంవత్సరం'గా అభివర్ణిస్తున్నారు. భిన్నమైన కథలు, భారీ స్థాయి నిర్మాణ విలువలు, పాన్ ఇండియా మార్కెట్‌లో ప్రభాస్‌కు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తాయనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# హీరోయిన్లను గౌరవంగా చూపించడంలో లోటు ఉంది



మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా గడుపుతోంది. ఇటీవల 'ఓ రోమియో', 'ఓదెల-2' వంటి చిత్రాలతో అలరించిన తమన్నా... స్పెషల్ సాంగ్స్‌లోనూ మాస్ స్టెప్పులతో ప్రేక్షకులను అలరిస్తోంది. ప్రస్తుతం బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి 'వాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' అనే క్రేజీ యాక్షన్ అడ్వెంచర్ మూవీలో నటిస్తోంది.దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వంలో, బాలాజీ టెలిఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సునీల్ గ్రోవర్, శ్వేతా తివారీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను ఆగస్టు 26న గ్రాండ్‌గా థియేటర్లలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే, తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తమన్నా సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీపై చేసిన కొన్ని బోల్డ్ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట ట్రెండ్ అవుతున్నాయి.కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్లను కేవలం గ్లామర్ బొమ్మలుగా చూసే విధానం తనకు అస్సలు నచ్చలేదని తమన్నా చాలా ఓపెన్‌గా చెప్పింది. సౌత్ ఇండస్ట్రీలో పురుషాధిక్యత ఎక్కువగా కనిపిస్తుంటుందని, హీరోయిన్లను స్క్రీన్‌పై గౌరవప్రదంగా చూపించే విషయంలో అక్కడ కొంత లోటు కనిపిస్తోందంటూ తన మనసులోని అసంతృప్తిని బయటపెట్టింది.భారతీయ సినిమాల్లో కమర్షియల్ ఎలిమెంట్స్ అయిన పాటలు, డ్యాన్సులకు చాలా ప్రాధాన్యత ఉంటుందని... ఈ విషయాన్ని తాను కెరీర్ ప్రారంభంలోనే గ్రహించానని తమన్నా తెలిపింది. బాలీవుడ్‌లో కేవలం యాక్టింగ్ మాత్రమే చేసే హీరోయిన్లు కొందరైతే, గ్లామర్ పాత్రలకే పరిమితమయ్యే వాళ్లు మరికొందరు ఉంటారని విశ్లేషించింది. కానీ, కేవలం ఒకే యాంగిల్‌కు పరిమితం కాకుండా... అటు గ్లామర్ చూపిస్తూనే, ఇటు నటనకు స్కోప్ ఉన్న పాత్రలు చేయగలిగిన వారే ఇండస్ట్రీలో సూపర్ స్టార్లుగా ఎదుగుతారని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.




# విజయ్‌ను అన్ ఫాలో చేసిన త్రిష

కొన్ని నెలలుగా సోషల్ మీడియాలో విజయ్- త్రిష పేర్లు వైరలైన విషయం తెలిసిందే. వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారని వార్తలు వచ్చాయి. తాజాగా వీరిద్దరూ విడిపోయారని ప్రచారం జరుగుతోంది. జూన్ 22న విజయ్ పుట్టినరోజు కావడంతో సినీ, రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. విజయ్ సీఎం అయ్యాక తొలి పుట్టినరోజు కావడంతో త్రిష విషెస్ కోసం అందరూ ఎదురుచూశారు. ప్రతి సంవత్సరం ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపే త్రిష మాత్రం ఈసారి ఎలాంటి పోస్ట్ పెట్టకపోవడంతో నెట్టింట కొత్త చర్చ ప్రారంభమైంది. కొన్నేళ్లుగా విజయ్ పుట్టినరోజున ఆయనతో కలిసి దిగిన అరుదైన ఫొటోలను త్రిష పంచుకునే వారు. కానీ, ఈసారి ఆమె మౌనంగా ఉండడంతో పాటు.. ఇన్‌స్టాగ్రామ్‌లో విజయ్‌ను అన్‌ఫాలో చేశారు. దీంతో ఈ అంశంపై నెట్టింట చర్చ జరుగుతోంది.

# వారసత్వం ఉన్నా...కష్టపడితేనే ఫలితం

## ప్రేక్షకులు ఊరికే ఆదరిస్తానుకోరాదు -నటుడు రామ్ చరణ్



సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ.. ప్రేక్షకులు ఎప్పుడూ నటుడి నటను చూసే ఆదరిస్తారని రామ్ చరణ్ అన్నారు. తాజాగా ఆయన 'రిపబ్లిక్ సమ్మిట్'లో పాల్గొని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బిజినెస్ భాషలో చెప్పాలంటే.. 'పెద్ది' సినిమా తన కెరీర్‌కు బెస్ట్ 'స్టార్టప్' లాంటిదని వెల్లడించారు. నా చిన్నప్పుడు దర్శకులు, నిర్మాతలు 'మీ నాన్న కంటే బాగా చేయాలి' అని చెప్పినప్పుడు బాధ్యతగా అనిపించేది. నేను ఆ ఒత్తిడిని పెద్దగా పట్టించుకోలేదు. మా నాన్న ఇంట్లో సరదాగా ఉంటారు. మా డైనింగ్ టేబుల్ మీద సినిమా చర్చలు, స్టార్డమ్ ముచ్చట్లు ఎప్పుడూ రానిచ్చేవారు కాదు. సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రావడం వల్ల త్వరగా ఒక మంచి వేదిక దొరుకుతుందనేది నిజమే.. కానీ, ప్రేక్షకులు మనల్ని ఎవరి వారసుడు అని చూడరు.. మొదటి సినిమా తర్వాత కేవలం మన కష్టం, నిజాయతీ మాత్రమే చూస్తారు. నా 15 ఏళ్ల కెరీర్‌లో ఆయన నాకు ఎప్పుడూ నటన పరంగా ఫీడ్‌బ్యాక్ ఇవ్వలేదు. నన్ను వేలు పట్టి నడిపించలేదు. కానీ క్రమశిక్షణ విషయంలో ఆయనే నాకు స్ఫూర్తి అని చెప్పారు.ఓటీటీల ట్రెండ్ గురించి మాట్లాడుతూ.. థియేటర్లు, ఓటీటీలు రెండూ ఒకదానికొకటి సాయం చేసుకుంటూ ముందుకు సాగాలి. 'ఆర్ఆర్ఆర్' థియేటర్లలో విడుదలైన తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి వచ్చింది. దానివల్ల పాశ్చాత్య దేశాల ప్రజలకు కూడా సినిమా చేరి, ఆస్కార్ నామినేషన్ వరకు వెళ్లేలా క్రేజ్ పెరిగింది. భారతదేశంలో ఇప్పటికీ ఒక కుటుంబానికి అత్యంత తక్కువ ఖర్చుతో దొరికే వినోదం సినిమానే. థియేటర్లలో పాప్‌కార్న్ ధరలు కాస్త తగ్గితే ఇంకా బాగుంటుంది. సినిమా అనేది ఓ భావోద్వేగం.. అది ఎప్పటికీ అలానే ఉంటుంది. దేశభక్తి కథలకు ఎప్పుడూ ప్రాధాన్యతనివ్వాలి. ఒక సినిమా రూ.500 కోట్లు లేదా రూ.800 కోట్లు వసూలు చేస్తోందంటే, దానర్థం దేశంలోని ప్రజలు ఆ కథను తమ సొంత కథగా భావించి ఆదరిస్తున్నారనే. దేశాన్ని ఏకం చేసే ఇలాంటి సినిమాలు రావడం గొప్ప విషయం' అని రామ్ చరణ్ తెలిపారు.